# ప్రియమైన ప్రియా...

డార్లింగ్ ప్రియా!

ప్రియమైన ప్రియా! అని సంబోధించలేక కాదు - నీకు యింగ్లీషు మీడియం అంటే కోపం అని కూడా తెల్సు, కాని "ప్రియ" మైన "ప్రియా" అంటే, అందులో మళ్ళీ మొదటి మాటకు ఉన్న శ్లేషార్థాన్ని తీసుకుని మళ్లీ నువ్వు కోపం తెచ్చుకుంటావనీ, - అసలే యిది యెండాకాలం ... నువ్వు నూరే కారాలు మిరియాలకు మీ యింట్లో వాళ్ళు యిబ్బంది పడతారేమోనని భయం.. 'ప్రియా''ప్రియా' అని నీపేరు తల్చుకుంటూనే ఆఫీసులో యివాళ పని అంతా పరధ్యానంగా పూర్తి చేశాను...ఉదయం మనం పడ్డ 'ఘర్షణ' నిజానికి మనంపడకుండా వుండాల్సింది!

పోనీ చిన్నదానివి పుట్టినింట గారంగా పెరిగిన దానివి; నువ్వు తొందరపడ్డా - నేను కొంచెం నిగ్రహించుకోవలసింది" అని చాలా సార్లు ఫీలైనాను నేను... గడియారం మీద కోపం కూడా వచ్చింది. టిక్కు టిక్కు మని హంసనడకలు నడుస్తూ యెప్పటికీ ముందుకు జరగదేం? అని విసుక్కున్నాను.

ఏం లాభం? ఎండ యింకా విపరీతంగా మండిస్తున్నా లెక్క చేయక ఉరుకులు పరుగులు మీద ఇంటకి చేరుకున్నానా? ఇంటి దగ్గర నాకేమిటి ప్రత్యక్షమైంది? సినిమా డ్రీమ్ సీక్వెన్స్‌లో "సాకీ' ద్రాక్షా సారాయం పట్టుకుని ఎదురొచ్చినట్లు నువ్వు, నిమ్మకాయ షర్బత్, మెళికల మెళికల రంగుల గాజు గ్లాసులో పోసుకుని నడుం దగ్గర్నుంచి ఆ పైకి ఒక లయలోను క్రింద భాగమంతా మరో లయలోను వంపులు తిరుగుతూ, బొండు మల్లె మొగ్గలు రువ్వుతున్నట్లు తెల్లని నీ ముత్యాల పలువరస చూపట్టగా నవ్వుతూ ఎదురొస్తా వనుకున్న నాకు... నాకు నా ముక్కు మీద గుద్దినట్లు యింటి గుమ్మానికి గొళ్లెం దానికి పెద్ద బోదురుకప్పంత తాళం కప్ప యెదురైంది!- రోహిణీ కార్తెలో తార్రోడ్డు మీద పరుగెత్తే కారు టైరు పంచరై పోయి బుస్సున గాలిపోతే నీరుగారి పోయినట్లు నా ఉత్సాహం అంతా నీరుగారి పోయింది!

ప్రియా! నీకు ముక్కు ఎంత అందంగా ఉంటుందో అంత ఎర్రగానూ కోపంలో అది కందిపోతుంది... మాట్లాడుతూ మాట్లాడుతూనే ఉదయం నాతో పోట్లాడేశావు.. ఆఫీసుకు వెళ్లే వాడికే

తెలుస్తుంది - వేళకి ఆఫీసుకి వెళ్లలేకపోతే ఎంత యిబ్బందో మరి... అందుకనే ఆ కోపంలో "పోతే పో! పుట్టింట నీక్కావలసిన సకల భోగభాగ్యాదులు ఉన్నాయి కనుక హాయిగా అనుభవించు" అని విసుక్కుంటూ - విసురుగా నేను వెళ్లిపోయిన మాట నిజమే!

కాని, కోపంలో నేనన్న మాటని నువ్వు యింత సీరియస్‌గా తీసుకుంటావను కోలేదు ఐనా యిరుగు పొరుగు దేనికైనా పిలిస్తే వెళ్లావేమో, "బాబిని ప్రయివేటునుంచి తీసుకు రావటానికి వెళ్లావేమోనన్న ఆశతో ఎదురు తెన్నులు చూడటానికే ఉంకిస్తున్నాను- అంతలో ఎదురింటి "హార్మోణీ లక్ష్మి" గారి "సందేశం" పరిగెత్తుకుంటూ వచ్చింది. తాళం చెవుల గుత్తి నా చేతుల్లో పడేసింది. ఏమైనా చెపుతోందేమోనని ఆశగా చూశాను.

"అంకుల్! రాత్రి మా అమ్మ మా కోసం కటిక పెసరపప్పు పచ్చడి చేస్తోందిట... మీక్కూడా కాస్త పంపమంటే పంపుతానంది". అదీ కుమారి సందేశం - నావేపు జాలితోనో, వేళాకోళంగానో నాకేతెలియని ఒక నవ్వు పారేసేసి, నా సమాధానం కోసం ఎదురు చూడకుండానే తుర్రుమని పారిపోయింది!

తాళం చెవిని దాని కప్పులో దూర్చటానికే నాకు ఐదుసార్లు ప్రయత్నం చేయవలసి వచ్చింది. ఎంత పని చేశావు ప్రియా! 'బాబీ'కి ప్రయివేటు కూడా పెట్టించాలి!- పాఠాలు పోతాయి!! దాన్ని రేపు జూన్‌లో యు.కె.జీ.కి కోచ్‌అప్ చేయిస్తున్నాం- అన్నదికూడా ఆలోచించడకుండా 'జెండా' ఎత్తేశావు? 'తెల్లజెండా' పట్టుకుని తెల్ల మొహం వేసుకొని నేను వచ్చాను- నువ్వేమో అలిగి పుట్టి నింటికి హుటాహుటి గ్రీష్మతాపాన్ని కూడా లెక్క చేయకుండా చంటిదాన్నితీసుకుని మరీ వెళ్ళిపోయావు! దారుణం ప్రియా!

ఇల్లంతా, రైలు బండీ వచ్చి వెళ్ళిపోయిన ప్లాట్‌ఫామ్‌లాగ బోసిగా వుంది... ఫ్లాస్కులో కాఫిలాంటిదేమైనా పోశావేమోనని చూడటానికి ముందు -నా దృష్టి వాటర్ బాటిల్ కోసం వెతికింది! ఎండాకాలం కదా? ప్రియా! వాటర్ బాటిల్ కూడా తీసుకు వెళ్ళ లేదు...? అంత ఆస్తి మితంగా ఆగ్రహంగా వెళ్లావు నువ్వు... ఫ్లాస్కులో కాఫీ లేదు - వంట యిల్లు చక్కబాట్లు కూడా చెయ్యలేదు... అంటే మధ్యాహ్నం బస్సుకే వెళ్ళిపోయావన్న మాట?!

అంతలో అలారం కొట్టింది! టైమ్ ఆరైంది - అలారమ్ ఎందుకూ? వెక్కిరించినట్లు.. అని అలారం "టైంపీసు" పీక నొక్కేద్దామని దాన్నిఎత్తుకునేసరికి నీ 'లెటర్' దాని క్రింద కనపడ్డది "వోహో!' ' అనుకొని తీసుకున్నాను.

"పుట్టినింటికి పొమ్మన్నారుగా పోతున్నా అంత పౌరుషం లేకుండా లేరెవరూ యిక్కడ..!"

గుడ్‌బై.. "మీకు అప్రియం అయిపోయిన మీ ప్రియం వద" అని అంటీ అంటనట్లు నాలుగు ముక్కలు రాసి అక్కడ పారేసిపోయావు.

ఎందుకు ప్రియా?... ఏమన్నాను నేను?- అసలు ఆఫీస్ నుంచి వస్తూ నీ కోసం ఏం తెచ్చానో తెలుసా? నీకు... నీవంటే నాకు యిష్టం లేకపోడం ఏమిటి? అవును! యీ మాటలు చదువుతున్నప్పుడు నీవు కోపంతో బుసలు కొడతావు. నల్లని కారు మేఘ శకలాల్లాంటి నీ ముంగురులు, చందమామ

లాంటి నీ మొహంలో దోబూచులాడుతున్నట్లు పైకి ఎగిరి కిందకి వాలుతాయి - "ఒస్స్! నా కోసం, ఏం తెస్తారో మీరు తెలియదేమిటి? అనుకుంటావు... వాటికేం పెట్టుబడి పెట్టాలా! శ్రమ పడాలా? తలుపు తెరుస్తూనే లోపలికి వచ్చి - తలుపులు వెనక్కి ఓ చేత్తో తోస్తూ, రెండో చేత్తో నన్ను అందుకుని... యిరుగూ పొరుగూ "వింటా"రనైనా చూడకుండా యిచ్చే "అధరమధుర" బహుమతులేగా" - అని తీసి పారేస్తావు ఔనా? - కాని యీసారి అలాంటి 'అధర మధురాలుకాదు "రియల్ సర్‌ప్రయిజింగ్ బహుమతి తీసుకొచ్చాను" కాని, ప్చ్!... నన్ను వొంటరివాణ్ణి చేసి... శూన్య మందిరంలో శిధిల విగ్రహంలాగా పారేసి వెళ్ళిపోయావ్.....

ప్రియా! నువ్వు, నీ మధురాతి మధురమైన తేనె పలుకులూ, లేని యీ యింట్లో నేనేం చెయ్యను? అయినా గ్యాస్ వెలిగించి కాఫీ అయినా చేసుకుందాం?... కొంచెం ఆందోళన తగ్గుతుంది అనుకున్నా... కాని నా మీద జాలి లేని నీ అంతరంగంలాగే గ్యాస్ పొయ్యి" మారుపలకలేదు. గ్యాస్ అయిపోయిందన్నమాట... ఐనా నువ్వు నా మానాన, నా పాట్లు నన్ను పడమని వెళ్ళిపోయావ్!

బల్లమీద నీ బస్టు సైజుఫోటో చూస్తూ అలాగేకూర్చున్నాను... పోయిన్నెల యిదే పదో తారీఖు పౌర్ణమినాడు మనం డాబా మీద కూర్చున్నపుడు నాదో మాట వింటారా? అడగనా? అన్నావు నువ్వు... నేనేమన్నాను? పంచదార కన్నా పనస తొనలకన్నా జుంటి తేనె కన్నా చెలి మాట తీపి అన్నాడు మహానుభావుడు యోగి వేమన్నగారు - ప్లీజ్ గో అన్ ప్రియంవదాదేవీ! ప్లీజ్" అన్నాను.

"మనం కూడా ఒక ఫ్రిజ్‌కొనుక్కుందాం అండీ" అన్నావ్ నువ్వు.

నా గుండె కాయ ఫ్రిజుడైర్‌లో పెట్టి తీసిన టమాటా పండు లాగ చల్లబడిపోయింది - "ప్రక్కింటి చిట్‌ఫండ్‌కంపెనీ ఛిరుబుర్రేశ్వరరావుగారు ఫ్రిజ్, స్కూటర్ మెంటైన్ చేస్తున్నాడు మనం ఆ మాత్రం కొనుక్కోలేమా? అన్నావు నువ్వు...

"ఛిరుబుర్రేశ్వరరావు కాదు చిరుతల భోగేశ్వరరరావు అతని పేరు - వాళ్లావిడ ధనలక్ష్మి వస్తూన్నప్పుడు అర లక్ష రూపాయలు తీసుకొని లాటరీ లక్ష్మిలాగ వచ్చింది. పైగా అతనికి ఫ్రిజ్‌అవసరం - రకరకాల అలవాట్లు - విచిత్రమైన ఫ్రెండ్సు అన్నాను....."

"ఛీ" అని మొహం నల్లగా చేసుకున్నావు. వెన్నెలంతా చీకటి అయిపోయింది నాకు. ఆ రోజు నువ్వు సమస్యని అర్థం చేసుకోలేదు - "ప్రెస్టేజ్ యిస్యూ" చేసుకున్నావు - చదువుకున్నదానివి - కాని ఏమనేశావ్? నేను కట్నం తీసుకురాకుండా వచ్చానని మీకు చులకన అయిపోయానా? అన్నావు। నాకు ఆ మాట యిప్పటికీ గుండెల్లో కలుక్కుమంటూనే వుంది... నేను అత్తారింటి నుంచి ఆవ గింజ కూడా నా యింటికి రాకూడదు - అని అక్షరాల అనుకొనేవాణ్ని అని నీకు తెలీదూ? ఔను - యివాళ మాత్రం ఏమైంది? 'బాబీ'కి వాళ్లు అంతా గోనే పట్టాలాగ ప్రేలిపోయింది... యీ యింట్లో కూచుంటే అగ్నిగుండంలాగ వుంది అన్నావు నువ్వు.. నేను నీకో సూచన చెప్పేలోగానే, నా భుజం మీద తల ఆన్చి గోముగా, మనం అర్జంటుగా ఒక "కూలర్" కొనుక్కుందాం అండీ! అన్నావు... అప్పుడు నేను గెడ్డాం

చేసుకుంటున్నాను. తెగినంత "చుర్రు" మంది నాకు... ఎయిర్‌కూలర్?.. మామూలు ఎలక్ట్రిక్ ఫ్యాన్‌కొనటానికే పోయినేడాది నేను "టాలాలు" గుణించానే.. కూలర్ కొనగలనా? దాన్నిమెయింటైన్ చేయగలమా - అంతే. యిదే చిలికి చిలికి గాలి వాన అయ్యింది. నువ్వు యిలా అలిగి వెళ్ళిపోయావు -"గుడ్‌బై" అన్నావు.. అది యింగ్లీష్ మీడియం అంటే వేళాకోళం చేసే నీవే అన్నావు అంటే ఎంత కోపంగా వున్నావో వూహించగలను.

వేలకివేలు పోసి మనం వస్తువులు కొనాలీ, అంటే అది అప్పులు చేస్తే తప్ప కుదరదు. అప్పులంటే నాకు నరాలలోకి నుంచి తిమ్మిరెక్కి పోయినంత భయం వేస్తుంది. "కూలర్" ఒక స్టాటస్ సింబలేగాని ఎండాకాలంలో కొత్త కూజాలో నీళ్ల త్రాగి "వట్టివేళ్ల" తడికెల మీద నీళ్లు జల్లుకుని - మన మధ్యగదిలో కూచుంటే ఎలా వుంటుంది? అచ్చం " రంభా ఎయిర్ కండిషన్" రెస్టారెంట్‌లో కూర్చున్నట్లుంటుంది.

బాగా ఆలోచించు.. నేను ఉద్యోగస్తుణ్ణి- ఆఫీసర్నే కావచ్చును గాని "జీతం" తప్ప "గీతం" లాంటిది నాకు కిట్టదు. అప్పుచేసి పప్పుకూడు - లంచంపట్టి సుఖపడటం లాంటివి దేశ ద్రోహంగా భావించే వాళ్లం మనం - మనిద్దరం యిలాంటి అభ్యుదయ భావాల విషయంలో ఒక్కటే కదూ ప్రియా!

సంవత్సరంలో చివరి మూడు మాసాలు జీతంలో నుంచి యిన్‌కంటాక్స్ కోతపడే గడ్డు నెలలు...అప్పుడే వస్తుంది "సమ్మర్" - బ్యాంకు ఋణమైనా, అది రుణమే అవుంది - ప్రియా! జ్ఞాపకం తెచ్చుకో-నీవే చాలాసార్లు అన్నావు వట్టి వేళ్ల తడికెలు గుమ్మాలకీ, కిటికీలకీ కట్టడంలో ఎంత అందం వుందోనని... "పవర్ కట్ 'కరెంట్ ఫెయిల్యూర్" లాంటి యిబ్బంది కూడా వుండదు... ఎండా కాలానికి సరదాగా ఎప్పుడేనా అయిసుక్రీములు తింటాం - కాని రోజూ మజ్జిగ తేట త్రాగి, పుచ్చ బద్దలు తింటాం అనుకో - ఆరోగ్యం ఆనందం రెండూ. ఔనా?

మీ పుట్టింట్లో "ఫ్రిజ్" వుంది - కూలర్ వుంది - "మిక్సీ" వుంది వాషింగ్ మెషీన్ కూడా వుంది -అవన్నీ మీ నాన్నగారు - నువ్వు పుట్టినప్పుడు కొన్నారేమో? అడుగు - పిచ్చుక, ఒకటీ అరా పుల్లా పీచూ తెచ్చిగూడు కట్టుకున్నట్లుగా, సంసారంలో పెద్ద వస్తువుల్ని - పొదుపుగా వుండి సమకూర్చుకుంటేనే ఆనందం!

డాళింగ్!... ఆధునిక పరికరాలు కొన్ని గొప్పకేగాని వీటివల్ల నిజమైన సదుపాయం సుఖం వుండవు - మనం పత్రికల్లో చదువుకోలేదు? ఒకళ్ళింట్లో వాషింగ్‌మెషీన్ కొనుక్కున్నారు... మన బాబీ లాంటి పాప వుంది వాళ్ళకి - అంతలో చిన్నబాబు కూడా పుట్టాడు కాని, బాబు వాళ్ళ తాతగారి పోలిక నల్లగా వున్నాడు - అమ్మకీ నాన్నకీ గోపాలకృష్ణుడులాగా కనబడ్డాడు, కాని, ఆ చిన్నారి పాపకి తమ్ముడు తనలాగే తెల్లగా లేకపోడం కష్టమనిపించింది... ఆ చిన్నారికి , వాషింగ్ మెషీన్‌లో బట్టలు వుతికితే తెల్లగా వస్తాయని తెల్సు - అలాగే తమ్ముణ్ణి కూడా అందులో వేసి తీసేస్తే తెల్లగా వచ్చేస్తాడనుకుంది - ఈ సంగతి తల్లికి చెబితే కోప్పడుతుంది - అందుకనేమో - ఓనాడు వాళ్ళ అమ్మ అలా బయటికి వెళ్లడం

చూసి యీ పాప, వాళ్ళ తమ్ముణ్ణి తీసి "ఏరే తమ్ముా"! నిన్ను నాలాగ తెల్లగా చేస్తా చూస్కో అంటూ ఆ వాషింగ్ మెషిన్ డబ్బాలో పడేసి మూత పెట్టి స్విచ్ నొక్కేసింది.. ప్చ్! ఎంత ట్రాజడీ! పిల్లలు పెద్దాళ్ళయ్యేదాకా యిటువంటివి కొనకూడదు. ఇది సందర్భవశాత్తు చెప్పాను.

అంతే, కీడెంచి మేలెంచమంటారే? ఆ సామెత యిందుకే కాబోలు. ఏమిటేమిటో రాస్తున్నాను.. సారీ ప్రియా! నీ కోరికలేమీ గొంతెమ్మ కోరికలు కావు.. ఆధునిక గృహ లక్ష్మికి వుండవలసిన, వుండే కోరికలే.. అందుకే నేను యీ సంగతి ఆలోచిస్తూనే వున్నాను-

కోపంలో నిన్ను "ఫో" అన్నానే తప్ప - నువ్వు లేక బ్రతకగలనా? తన కోపమే తన శత్రువు అంటారు. ఔను - నాకు తెల్సు - ఎక్కడో చదివాను... మనిషికికోపం చాలా నష్టదాయకం.. ఓ నిమిషం కోపంలో మనకి పోయే "శక్తి"తో ఓ రెండు వారాలపాటు బ్యాటరీ లైటు నిర్విరామంగా వెలిగించవచ్చునట..

పొదుపు గురించి మాట్లాడుతున్నాను కదా... నువ్వుంటేనే అది సాధ్యం లేకపోతే నేను రోజుకి నాలుగు కూల్ డ్రింకులు, రెండుసార్లు ఏ.సి.లో టిఫిన్, ఫ్రెండ్సుతో హోటలు భోజనాలు ఆ తర్వాత ఏం తోచక సెంకడ్‌షో సినిమా యిలా అంతా వేస్టు. అంచేత నువ్వు బాబీని తీసుకొని వచ్చేసేయ్!

నీకో శుభవార్త! ఏమిటో తెలుసా? నేను, నీ పేర రికరింగ్ డిపాజిట్ ప్రారంభించాను. మధ్యాహ్నం యింటర్‌వెల్లో చేసిన ఘనకార్యం యిదే.. యింకో శుభవార్త! సిగరెట్‌లు మానేశాను - ఆ పొదుపు కూడా నువ్వుకోరిన టెలివిజన్‌కి మదుపు అనుకో.... చూస్తూండగా మనం ఏమీ అప్పు చెయ్యకుండా, ఒకర్ని ఆశ్రయించకుండా వచ్చే సమ్మర్‌కి మనింట్లో హాయిగా నువ్వు కోరినట్లుగా 'జాలీ' గా గడపవచ్చును.

నాకు ఏమీ తోచదనుకో సిగరెట్ కాలుస్తాను - అది మానేశాను గనుక మా ఫ్రెండు రామం చెప్పాడు జర్దాకిల్లీ వేసుకుంటే సిగరెట్ మీద కోరిక వుండదని అది మొదలెడతాను... అంచేత నువ్వు తిరుగు టపాలో వచ్చేస్తే అన్నీ సరిగమలే... యిది అల్టిమేటం కాదు... శ్రీమతికి శ్రీవారి శ్రీముఖం కూడా కాదుకాని శ్రీమతికి శ్రీవారి ప్రేమలేఖ అనుకో... దాసరి తప్పులు దండంతో సరి అన్నారు ఔనా! ..ఏదీ నవ్వు...

నా తలపంతా నా ప్రేమంతా.
నాయి'దంతా అందంతా, దీంట్లో
పొట్లం కట్టి పంపుతున్నాను.
నీ కోసం చూసే
చకోర పక్షిగాడు నీవాడు చక్రధర్

xxx

(1988 కలువబాల)